# విశ్వాసం

అర్ధరాత్రివేళ హఠాత్తుగా మెలకువ వచ్చింది...

వీధిగుమ్మం తలుపు దగ్గర కుక్క అరుస్తోంది....అసలు నాకు మెలకువ రావటానికి కారణం కూడా అదే!....నిదానంగా విన్నాను....ఇంకా అరుస్తూనే వుంది...వుండి వుండి వీధి తలుపును కాలిగోళ్ళతో గీరుతున్న శబ్దం వినిపిస్తోంది.

"ఒకవేళ లిల్లీ కాదు కదా ?"—అనుమానం వచ్చింది.

మంచందిగి, గబగబావెళ్ళి వసారాలో లైటు వేసి—వీధి తలుపు తీసేను....తప్పుచేసిన దానిలా తలవంచుకుని, తోకాడించుకుంటూ నెమ్మదిగా లోపలకు వచ్చింది లిల్లీ".

కొన్నిక్షణాలు భయంతో నాగుండె కొట్టుకోవటం మానేసినట్టనిపించింది. అసలు లిల్లీ వీధిలోకి ఎప్పుడు వెళ్ళిందో?... ఎలా వెళ్ళిందో?....

దానివైపు చూశాను... నాలిక బైటపెట్టి ఒగరుస్తోంది...నావైపు చూడటానికి భయపడుతోంది.

"ఎక్కడికెళ్ళేవే?" కోపంతో గద్దించేను.

తనలోతాను ముడుచుకుపోయి దొంగచూపులు చూస్తూ - వంగి వంగిగా అడుగులువేస్తు పెరట్లోకి నడిచింది.

ఇంతలో ఈ హడావిడికి ఇంట్లో అందరూ లేచారు.

లిల్లీ బయటికెలా వెళ్ళిందీ" శ్యామలను అడిగేను.

"ఏమో మరి! ఎనిమిదింటికి అన్నం తిన్న తర్వాత షెడ్డులోకి వెళ్ళి దానికుర్చీలో అది పడుకుంది. ఆ తర్వాత అది వీధిలోకి ఎలా వెళ్ళిందో?"

"నాన్నగారు సినిమానుంచి వచ్చినప్పుడు మనం తలుపుతీసేంగా! చూళ్ళేదు కానీ - బహుశా అప్పుడు వీధిలోకి వెళ్ళిపోయుంటుంది"— ఊహిస్తూ చెప్పింది అరుణ.

అలాగే జరిగివుండాలి...

రాత్రిళ్ళు నేను ఆఫీసునుంచి రావటం ఎప్పుడైనా లేటయితే-నా కోసం ఎదురుచూస్తూ వీధిగది కిటికీలోనే కూర్చోవటం దానికి అలవాటు. అంతవరకూ అది షెడ్డులోకి వెళ్ళదు...వెళ్ళినా కాలు కుదుర్గుండదు.

"డేడీ! లిల్లీకి వెనకాలచూడండి!..అదిగో..రక్తం వస్తోంది!" శేషు ఒక్కసారిగా అరవటంతో అటు చూశాను.

దారుణం...!

ఏది జరక్కూడదని యింతకాలం జాగ్రత్తపడుతూ వచ్చానో అదే జరిగిపోయింది. వీధిలోవుండే మగ కుక్కలు లిల్లీని పాడు చేసేయి... కోపంతో నా ఒళ్ళు మండిపోయింది. పక్కనేవున్న ఇనుపగొలుసు తీసుకున్నాను-

"...ంముండా హాయిగా వేళపట్టుకుతిని యింట్లోపడివుండక నీకు తిరుగుళ్ళు కావాల్సొచ్చాయా?..." ఆవేశంలో నాలుగు తగలనిచ్చాను. తప్పించుకునే ప్రయత్నం చేయకుండా ముడుచుకుపోయి కుయ్యో మొర్రో అంటోంది.

"అయ్యయ్యో...చచ్చిపోతుందండీ పిచ్చిముండ !" నాచేతిలోని గొలుసు లాగేసి దూరంగా విసిరేసింది శ్యామల. అయినా నాలో కోపం చల్లబడలేదు.

"ఒరేయ్ శేషూ !... రేప్పొద్దున్నే దీన్ని తీసుకెళ్ళి దూరంగా ఎక్కడైనా వదిలేసిరా !..యింట్లో సుఖం మరిగింది పాడుముండ... వీధిన పడితే కానీ తెలిసిరాదు...వదిలేసెయ్..." అన్నాను శేషుతో.

నావైపు వింతగా చూస్తూనే, అది చేసిన తప్పేమిటో ఊహించేందుకు ప్రయత్నంచేస్తున్నాడు శేషు...వాడి లేతమనసుకి ఇలాంటివి అర్థంకావు.

అరుణ అప్పటికే తన గదిలోకి వెళ్ళిపోయింది.

నాకుమాత్రం ఆరాత్రి చాలాసేపు నిద్రపట్టలేదు...లిల్లీనిగురించే ఆలోచనలు...

లిల్లీ మా యింటికి అనుకోకుండా వచ్చింది.

నాలుగేళ్ళక్రితం-

ఓసారి ఆఫీసు పనిమీద నేను వేరేవూరు వెళ్ళి వారంరోజుల తర్వాత యింటికి తిరిగి వచ్చేసరికి నాకాళ్ళకు అడ్డంపడుతూ చిన్నకుక్కపిల్ల కనిపించింది. గోధుమరంగు శరీరం, నల్లటి కళ్ళు, నుదుట తెల్లని నామం, కొనదేలిన చెవులు, చూడగానే ముద్దొచ్చేలా వుంది.

"ఇంట్లోకి ఇదెలా వచ్చింది ?" అడిగేను శ్యామలని.

"పక్క వీధిలో ప్లీడరుగారి కుక్క పిల్లలను పెట్టింది. అందులో ఇది బాగుందని, శేషు తీసుకొచ్చాడు. నాలుగురోజులైంది !" దాన్ని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటూ చెప్పింది.

"ఇప్పుడు ముద్దుగానే వుంటుంది. పెద్దవుతున్నకొద్దీ దీన్ని పెంచటమంటే మాటలుకాదు !"

"రోజూ కాసిని పాలుపోసి బన్ను కొని పెడితే అదే సరిపోతుంది. పైగా పిల్లలుకూడా ముచ్చటపడుతున్నారు !" తన ముచ్చట కూడా అదేనని పరోక్షంగా చెప్పింది శ్యామల.

కానీ నాకు మొదటినుంచీ కుక్కలంటే భయం...నా చిన్నప్పుడు మా యింట్లో ఓ అల్సేషియన్ వుండేది. దాన్ని 'టామీ' అని పిలిచేవాళ్ళం. దానికి చాలా విద్యలు వచ్చేవి. మా నాన్నగారికి సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె తీసుకెళ్ళి యిచ్చేది. తలుపు దగ్గర వెయ్యమంటే వేసొచ్చేది. అయిదారేళ్ళ తరువాత దానికి హఠాత్తుగా పిచ్చెక్కింది. మా తమ్ముణ్ని కరిచిందికూడా... అప్పుడు వాడి 'బొడ్డుచుట్టూ పదకొండో పన్నెండో ఇంజక్షన్లు ఇప్పించాం.

పిచ్చికుక్క మనిషిని కరిస్తే మనిషికి కూడా పిచ్చెక్కిపోతుందని చాలా సందర్భాల్లో ఎలాంటి వైద్యం కూడా పనిచేయదని అప్పటిలో చాలామంది అనుకునేవారు. అందుకే కుక్కల జోలికి పోవడం అంటే నాకు చాలా భయం,

అయినా పరిస్థితి చేయిదాటిపోయింది. అప్పటికే అది పిల్లలకు బాగా మచ్చికయిపోయింది...'లిల్లీ' అని దానికప్పుడే నామకరణం చేశారు కాబోలు ఆపేరెట్టి పిలవగానే తలఎత్తి అందంగా చూస్తోంది.

అది పెరిగి పెద్దదవుతున్నకొద్దీ నాలో ఓ రకమైన భయం బయల్దేరింది.

'లిల్లీ పెద్దదయింతర్వాత పిల్లల్ని పెడితే-ఆ పిల్లలు పెరిగి పెద్దవై మళ్ళీ మళ్ళీ పిల్లల్ని పెడుతూపోతే ?

'మగకుక్కనైనా తెచ్చేరుగాదు..ఈ ఆడకుక్కను ఎలా భరించాలో ఏమిటో !' అన్నాను ఓసారి శ్యామలతో.

ముసిముసిగా నవ్వేసి వూరుకుంది శ్యామల.

ఏ కుక్కయితేనేం ?....విశ్వాసం దానికి భగవంతుడిచ్చిన వరం!

రానురాను లిల్లీ నాదగ్గర బాగా అలవాటయిపోయింది. రాత్రి తెల్లవార్లూ షెడ్డులోనే పడుకున్నా-తెల్లవారగానే నా గదిలోకి వచ్చేసి నా మంచం పక్కనే నేలమీద పడుకుంటుంది....నేను లేచింతర్వాత నావెన కాల వెనకాలే తిరుగుతుంంది. నేను ముఖం కడుక్కొని వాలు కుర్చీలో కూర్చోగానే న్యూస్‌పేపర్ తీసుకొచ్చి ఇస్తుంది....దానికి ఆ విద్య నేర్పటానికి రెండు నెలలు పట్టింది. మళ్ళీ నేను పేపరు చదువుచున్నంతసేపూ - అక్కడే నా కాళ్ళదగ్గర కూర్చుంటుంది...ఆ తర్వాత దానికి బ్రెడు తెప్పించి పెట్టాలి !

నేను భోజనం చేసేటప్పుడు నా దగ్గర తిష్ఠవేస్తుంది....దానికి నేనే అన్నం పెట్టాలి....ఇంకెవరి దగ్గరకూ చేరదు....

మళ్ళీ నేను సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేవేళకి-వీధి గది కిటికీలో మకాం పెడుతుంది.... !

మొత్తానికి ఇంటిలో అదీ ఒక మెంబరైపోయింది. నేను ఏదైనా వూరువెడితే, తిరిగి వచ్చేటప్పుడు పిల్లలతోపాటు ధానికూడా బిస్కట్లో, బ్రెడ్డో తీసుకురావల్సిందే !....తేకపోతే అది వూరుకున్నా నా మనసు వూరుకోదు.

మా వీధిలో మగ కుక్కలు చాలా వున్నాయి.... ఒంటినిండా గజ్జితో, తెగిపోయిన తోకలతో, లోతుకుపోయిన డొక్కలతో, చాలా అసహ్యంగా కనిపిస్తాయి. అందుకే లిల్లీని వీధిలోకి వదలాలంటే భయం. వాటితో చెలగాటం ఆడుతున్నప్పుడు అందులో ఏదైనా పాడు కుక్క లిల్లీని కరిస్తే?....లిల్లీకి పిచ్చెక్కుతుంది...అప్పుడు దీన్ని బలవంతంగా చంపెయ్యాలి. ఆ దారుణాన్ని ఇంటిలో ఎవ్వరం చూడలేం!

"ఒకవేళ ఆ వీధి కుక్కలు లిల్లీని పాడుచేస్తే?"

ఆ ఊహే భయంకరంగాతోచేది. అందుకే ఎంతో జాగ్రత్తగా ఎప్పుడూ వీధిలోకి వదలకుండా పెంచుతూ వచ్చాం ఇన్నాళ్ళూ...

అప్పుడప్పుడు శ్యామల అనేది–

"దానికి మాత్ర కోరిక పుట్టదా?" అనీ.

నిజమే.... దానికూడా మనిషికి వున్నట్టే ప్రాణం వుంది. మనిషికి వున్నట్టే దానికీ కోరిక వుంటుంది! సృష్టి విచిత్రమే అది,

మరి ఆ కోరికను చంపెయ్యటం పాపమౌతుందా?

పశువుల ఆసుపత్రికి తీసుకెళ్ళి మంచి జాతికుక్కచేత 'క్రాస్' చేయించమని కూడా ఒకరిద్దరు సలహాకూడా ఇచ్చారు.

ఈలోగా ఈ సంఘటన!!

ఇప్పుడేమవుతుంది?....కొన్ని నెలలు పోయింతర్వాత లిల్లీకి పిల్లలు పుడతాయా?

తలుచుకున్నకొద్దీ కోపం ఆవేశం మరింత ఎక్కువవుతున్నాయి. బలవంతాన ఆలోచనలు కట్టిపెట్టి కళ్ళుమూసుకున్నాను...

పొద్దున్న నేను నిద్రలేచేసరికి యథాప్రకారం నా మంచం ప్రక్కన పడుకుంది లిల్లీ....నన్ను చూచి తోకాడించింది. ముఖం కడుక్కుని కుర్చీలో కూర్చోగానే - పేపరు తీసుకొచ్చి నా ఒళ్ళో పడేసింది.

"చూశారా! కుక్కబుద్ధి అంటే అదే! రాత్రి మీ చేతిలో చావుదెబ్బలు తింది...తెల్లారేసరికి మళ్ళీ తోకాడించుకుంటూ మీచుట్టూ తిరుగుతోంది!" అంది శ్యామల కాఫీ యిస్తూ.

కాఫీతాగుతూనే లీల్లిపైపు చూశాను.

చాలా నీరసంగా కనిపించించింది. వెనకాల రక్తం మరకలు ఎండిపోయి అలాగే వున్నాయి. వాటిని చూస్తుంటే రాత్రి అది ఒడిగట్టిన పాడుపనే గుర్తుకొచ్చింది. నా ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లనిపించింది.

"ఒరేయ్ శేషూ! దీన్ని తీసుకుపోయి ఇవాళ ఎక్కడైై వది లేసిరా!" అన్నాను.

"చాల్లెండి..ఎవరైనా వింటే నవ్విపోతారు.. అయినా అది ఏమంత మహాపాపం చేసిందనీ అంత అసహ్యంచుకుంటారూ?" అడిగింది శ్యామల వంటగదిలోంచే.

"అంటే...? రాత్రి అదిచేసింది పాడుపనికాదా?... రేపెప్పుడో దానికి కడుపొస్తే నువ్ పురుడోస్తావా?" కోపంగానే అడిగేను.

"ఏం ? పోస్తే తప్పా ?"

"వీల్లేదు ! వీధికుక్కల్తో తిరిగొస్తే దీనికి పుట్టేవి కూడా చీడ ముండలే పుడతాయి...మళ్ళీ వాటిని వదుల్చుకోవటం చచ్చినంతపని !" నా నిర్ణయాన్ని మార్చుకోదల్చుకోలేదు.

మా సంభాషణంతా విన్న శేషు అన్నాడు-

"నేను సైకిలుమీద తీసుకెళ్ళి బంజారాహిల్స్ దగ్గర వదిలేసి వస్తాను డేడీ !"

"వదిలెయ్....రోగం కుదుర్తుంది"- కసిగా దానివైపు చూశాను. కానీ జరగబోయేదేమిటో దానికి అర్థంకాలేదు కాబోలు... నావైపు మామూలుగా చూస్తూ తోకాడించింది.

ఆపూట లిల్లికి బ్రెడ్ తెప్పించలేదు. భోజనం చేస్తూంటే వచ్చి నా పక్కనే కూర్చుంది...అయినా నేను జాలిపడదల్చుకోలేదు. అప్పుడు మళ్ళీ హఠాత్తుగా లిల్లి జ్ఞాపకానికి వచ్చింది.

"సాయంత్రం నేను వచ్చేటప్పటికి యిది ఇంటిలో వుండకూడదు!" మరోసారి హెచ్చరించి ఆఫీసుకి వెళ్ళిపోయాను.

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేస్తూంటే-

'శేషూ లిల్లిని తీసుకెళ్ళి వదిలేశాడో లేదో ?'

నాలుగేళ్ళపాటు దాన్ని పెంచిన మమకారం ఇంటిలో అందరికీ వుంది. శేషుకి అదంటే చాలా ప్రేమ. వాడే ఎప్పుడైనా దాన్ని వీధిలోకి తీసుకెళ్ళి కాసేపు తిప్పుకొస్తాడు. పేపరు తీసుకొచ్చినాకు యిచ్చేవిద్య దానికి వాడే నేర్పించాడు.

'నామాట కాదనలేక' వదిలేస్తానన్నాడు కానీ — నిజంగా వాడి మనసు ఒప్పుతుందా ?'

కానీ శ్యామల ఊరుకోదు. నా పట్టుదల ఎలాంటిదో శ్యామలకు బాగా తెలుసు.

'బహుశా వదిలేసే వుండాలి !'

ఆలోచిస్తూనే ఇంటికి వచ్చేశాను. హాల్లో కిటికీ దగ్గర ఎప్పటిలా లిల్లి కనిపించలేదు.

గుండె ఝల్లుమంది....

ఇల్లంతా ఎంతో నిశ్శబ్దంగా....ఎంతో గంభీరంగా వుంది. బట్టలు మార్చుకున్న తర్వాత హాల్లోకి వచ్చి కూర్చున్నాను. అక్కడే మరో సోఫాలో కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటోంది అరుణ.

శ్యామల కాఫీ తీసుకొచ్చి టీపాయ్ మీద పెట్టింది.

అక్కడి నిశ్శబ్దం భయం కలిగించేలా వుంది..శేషూ కనిపించక పోయేసరికి అనుమానం వచ్చింది.

'ఒకవేళ లిల్లిని బయటకు తీసుకెళ్ళి తెప్పుతున్నాడేమో ?'

"లిల్లిని వదిలేశాడా ?" కాఫీ తాగిం తర్వాత ఖాళీకప్పు శ్యామలకు ఇచ్చేస్తూ అడిగేను.

"మీరు పదిసార్లు చెబితే వదలకుండా వుంటారా ?"—నిష్ఠూరంగా బదులు చెప్పింది.

నేను చెప్పింది రెండుసార్లే అయినా ఆ చెప్పటంలో ఎంతటి పట్టుదలా, బలమూ వుంటాయో—మా యింటిలో అందరికీ తెలుసు.

అందుకే నా ఆజ్ఞ శిరసా వహించారు.

"ఎక్కడ వదిలేశావ్ లిల్లిని ?"

రాత్రి భోజనాల దగ్గర శేషును అడిగేను.

"బంజారాహిల్స్ దాటిపోయాక డౌన్‌లో సందుల్లేవూ ?.... అక్కడ వదిలేసి నేను సైకిలుమీద వచ్చేశాను. మూడుమైళ్ళుంటుంది. యింక మనింటికి దారితెలీదు దానికి !" శేషు చెప్తూంటే వాడి గొంతు ఎందుకో వణికినట్టనిపించింది.

రాత్రి మళ్ళీ నిద్రపట్టలేదు.... ఆలోచనలన్నీ మళ్ళీ లిల్లీ గురించే నాలుగేళ్ళ అనుబంధం ఎంత సులువుగా తెగిపోయింది ?

రాత్రిళ్ళు వెచ్చగా షెడ్డులో-కుర్చీ ఎక్కి మరీ పడుకునేది.... పాపం యిప్పుడెలా వుందో ? ఇంటికి దారి తెలియక, అయోమయంగా దిక్కులుచూస్తూ ఎక్కడెక్కడ తిరుగుతుందో ?

'నేను తొందరపడ్డానా ?'

'ఏమో-అలా ఎందుకనుకోవాలి ? ఋణం తీరితే క్షణంకూడా వుండరట ! అలాగే లిల్లి కూడా ! దానికీ ఈ యింటికీ ఋణం తీరిపోయే సమయం వచ్చింది. అందుకే ఆ సంఘటన జరిగింది. నా లోని ఆవేశం ఆమాటనిపించింది. లిల్లి వెళ్ళిపోయింది.... అంతే !'

నాకు నేను అలా సమాధానం చెప్పుకుని కళ్ళుమూసుకున్నాను.

మర్నాడు పొద్దున్న నేను బాత్రూంలో ముఖం కడుక్కుంటూంటే పక్కనున్న వంటింట్లో శేషు వాళ్ళమ్మను అడుగుతున్నాడు-

"ఇవాల్టినుంచి పాపం లిల్లికి బ్రెడ్డుండదుకదు మమ్మీ!"

"లేకపోతేనేం ?.....వీధిలో ఎన్ని కుక్కలు బ్రతకటంలేదూ ?.... అలాగే లిల్లికూడా బ్రతుకుతుందిలే!" శ్యామల సమాధానం చెబుతుంది.

ఆపూట నాతో ఎవరూ మాట్లాడలేదు. నన్ను ఓ హంతకుణ్ని చూసినట్టు చూస్తున్నారేమో అనిపించింది.

భోజనం చెయ్యకుండా ఆఫీసుకి వెళ్ళిపోయాను....

మరో రెండురోజులు చాలా నిర్జీవంగా గడిచిపోయాయి.

మూడోరోజు రాత్రి - పదిగంటలవేళప్పుడు - వారపత్రిక చదువుకుంటూంటే వీధితలుపుమీద కాలిగోళ్ళతో గీరుతున్న శబ్దం వినిపించింది....

'లిల్లి వచ్చేసిందా ?....

క్షణం ఆలస్యం చెయ్యకుండా వెళ్ళి తలుపు తీసేను.

ఎదురుగా లిల్లి!!

నా కళ్ళను నేను నమ్మలేకపోయాను. అలాగే దానివైపు సంభ్రమంగా చూస్తూ నిలబడిపోయాను. నెమ్మదిగా లోపలకు వచ్చి నాచుట్టూ తిరుగుతూ నా పాదాలు నాకటం ప్రారంభించింది. ఆనందం వల్లనో, ఆరాటంవల్లనో-కళ్ళల్లోకి అనుకోకుండా నీళ్ళుచిమ్ముకొచ్చేయి.

"శేషూ! లిల్లి వచ్చేసిందిరా!" లోపలకు ఉత్సాహంగా కేక పెట్టేను.

అరుణా, శ్యామలా, శేషూ గబగబా హాల్లోకి వచ్చారు. అందరి

దగ్గరకు ఆత్రంగా వెళ్ళి తోకాడిస్తూ ఏదోచెప్పాలనుకుంటున్నట్లు 'కుయ్‌కుయ్' మంది లిల్లీ.

"ఇల్లెలాతెలిసిందే పిచ్చితల్లి ?"- దాన్ని ఎత్తేసుకుని ముద్దులు పెట్టుకుంది శ్యామల.

సరైన తిండి లేకపోవడంవల్ల కాబోలు చాలా బక్కచిక్కిపోయింది. డొక్కలు లోపలకు పోయాయి. ఒంటిమీద అక్కడక్కడ మట్టిమరకలు....

అప్పటికప్పుడు వేడినీళ్ళు పెట్టి - లిల్లి ఒళ్ళంతా సబ్బుతో రుద్ది నీళ్ళుపోసి—దగ్గరుండి అన్నంకలిపి పెట్టింది అరుణ....

ఆ రాత్రి యింటిలో అందరికీ నిశ్చింతగా నిద్రపట్టింది.

* * *

ఆరోజు—

ఆఫీసునించి యింటికొచ్చి హాల్లో అడుగుపెట్టేసరికి గదిలోంచి శ్యామల గొంతు వినిపించింది-

"ఎంతపనిచేశావే పాపిష్టిదానా ! యిప్పుడెలా ?.... ఈ విషయం మీ నాన్నగారికి తెలిస్తే నిన్నూ నన్నూ బతకనిస్తారా ?"

నా అడుగులోపలకు పడలేదు....హాల్లోనే ఆగిపోయాను.

"ఐనా, కాలేజీ చదువులు వద్దంటే మీనాన్న నామాట విన్నారు కాదు....యిప్పుడు నువ్ మా పీకలమీదకి తెచ్చేవ్....ఇంతకి బరితెగిస్తావనుకోలేదే !"-పిచ్చిదానిలా అరుస్తోంది శ్యామల...

"అంటే...కొంపతీసి అరుణ....ఏంచేసి వుంటుందో ఊహించుకోటానికి భయం వేస్తోంది.

"ఇప్పుడీ సంగతి నలుగురి నోళ్ళల్లోనూ పడిందంటే-మన పరువేం కావాలి ?....ఫలానా వారమ్మాయి పెళ్ళికాకుండానే తల్లయిందని చెప్పుకుంటే మేం తలెత్తుకుని బతగ్గలమా ?" దాదాపు ఏడుపుపర్యంత మవుతోంది శ్యామల.

అంతే !.... ఆతర్వాత నాకేం వినిపించలేదు.... క్షణంకూడా ఆలస్యం చేయకుండా ఒక్కసారిగా గదిలోకి వెళ్ళేను....

మంచంమీద-మోకాళ్ళమధ్య తలపెట్టుకుని ఏడుస్తున్న అరుణను బలంగా క్రిందికి లాగేను.

"నువ్వీ యింటిలో క్షణంకూడా వుండటానికి వీలులేదు.... గెటవుట్ !" కోపాన్నీ, ఆవేశాన్నీ, వుద్రేకాన్ని నాలో నేనే అణచుకునే ప్రయత్నంచేస్తూ సాధ్యమైనంత తగ్గుస్థాయిలో అరచేను.

అరుణ దీనంగా తల్లివేపు చూసింది.

"మేం పరువుగా బతకాలంటే నువ్వీ ఇంటిలో వుండటానికి వీలులేదు. వెళ్ళిపో !.... మాకు నువ్వసలు పుట్టలేదనుకుంటాం !" అరుణను చూస్తున్నకొద్దీ కోపం అణచుకోలేకపోతున్నాను.

అరుణ పైటచెంగుతో కళ్ళను తుడుచుకుంటూ బయటకు నడిచింది.

ఆ రాత్రి తెల్లవార్లూ శ్యామల నిద్రపోలేదని నాకు తెలుసు.

రెండురోజులు గడిచిపోయాయి.

అరుణ యింటికి రాలేదు....

"నాకెందుకో భయం వేస్తోందండీ" అన్నది శ్యామల.

నామనస్సుకూడా ఏదోకీడును శంకిస్తున్నా-శ్యామలకు ధైర్యం చెప్పక తప్పలేదు.... అరుణకోసం కాలేజీలో వాకబుచేస్తే రావటంలేదని

చెప్పేరు. స్నేహితుల యింటిలో కూడా కనిపించలేదు.

"పద్దెనిమిదేళ్ళపాటు ఎంతో అల్లారుముద్దుగా పెంచేం....విద్యా బుద్ధులు నేర్పించాం....కానీ ఇలాంటి పాడుపని చేసిందని తెలిసినప్పుడు మందలించేహక్కు తల్లిదండ్రులకు వుండదా?.... ఇంటిలోంచి వెళ్ళిపొమ్మంటే ఏదైనా అఘాయిత్యానికి పాల్పడమనా అర్థం?"

"ఈ కాలం పిల్లలకు విశ్వాసంలేకుండా పోతోంది."

"ఏమండీ! అమ్మాయి యింక రాదంటారా?"- అప్పుడప్పుడు శ్యామల అడుగుతూనేవుంది....

ఏమో?——

నాలుగేళ్ళు మా దగ్గర పెరిగిన లిల్లీని, తప్పుడుపనికి ఒడిగట్టిందనే కోపంతో దూరంగా ఒదిలివేసివస్తే నాలుగోనాటికల్లా ఇల్లు వెతుక్కుంటూ తిరిగివచ్చింది.

అలాగే అరుణకూడా ఎప్పటికైనా వస్తుందేమో!?

---

* స్వాతి ఏప్రిల్ '1982'